క్లుప్తంగా

అమరుల త్యాగాలు అజరామరం



సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర సాధనలో అమరవీరుల త్యాగాలు అజరామరం అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రభుత్వం '100 రోజుల ప్రణాళిక–ఒక మార్పు అభివృద్ధికి మలుపు' నినాదంతో ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు నూగిళ్ల మల్లయ్య, సంపత్, సయ్యద్ మస్తర్, సందవేణి రాజేందర్, బండారు రాంమూర్తి, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, అవినాష్, జగదీశ్, శ్రీమాన్, సుభాష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా నిలవాలి

సుల్తానాబాద్: మున్సిపల్ కేంద్రంలోని కామాక్షి క్లినిక్, మెడికల్ స్టోర్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం ప్రారంభించారు. క్లినిక్ ఏర్పాటు చేసిన కోడూరి రమేశ్–మౌనిక దంపతులను అభినందించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, కుమార్ కిషోర్, క్లినిక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

పాలకుర్తి: మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం రైతులకు వానాకాలం సాగుకు సమాయత్తం–వాతావరణ ఆధారిత సూచనలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం వీడియో, ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపికపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మండల పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మండలంలో ఎంపిక చేసిన గ్రామం నుంచి ముగ్గురు రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తన కిట్లు పంపిణీ చేస్తారని ఏవో ప్రమోద్ వివరించారు.

ముగిసిన పెద్దమ్మతల్లి బోనాలు



బోనాలతో మహిళలు

పాలకుర్తి: మండల పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లిలో ముదిరాజ్ కులసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి బోనాల ఉత్సవం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామశివారులో గల పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1180వ ర్యాంకు



అశ్రిత్ సాయి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టౌన్‌షిప్‌కు చెందిన విద్యార్థి నవులూరి అశ్రిత్ సాయి జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2025లో 1180వ ర్యాంకు సాధించాడు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న నవులూరి బ్రహ్మయ్య–రాధికల కుమారుడు నవులూరి అశ్రిత్ సాయి జేఈఈ మెయిన్స్–2025లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 99.98శాతం స్కోర్ చేసి 366వ ర్యాంకు సాధించాడు. ఈక్రమంలోనే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1180వ ర్యాంకు సాధించాడు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్ గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక లక్షెట్టిపేట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞానగ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రాజు, రాకేశ్, సభ్యులు సునీత, రవి, రాజు, రిషిత, రిశ్వంత్, రవళి, నాగిరెడ్డి, ఆదిత్య పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట ప్రాథమిక సహకార సంఘం, ఆగ్రోస్ ధూళికట్టలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.ఉమాపతి తెలిపారు. ఒక్కో బస్తా 30కిలోలు ఉంటుందని, సబ్సిడీ మినహా బస్తా ధర రూ.2137.50 రైతు చెల్లించాలన్నారు. రెండు ఎకరాలకు ఒక జీలుగ సరిపోతుందన్నారు.



గోదావరిఖని: వేడుకల్లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, జీఎం లలిత్‌కుమార్



గోదావరిఖనిటౌన్: జెండా ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి



పెద్దపల్లిరూరల్: జెండాకు వందనం చేస్తున్న పుట్ట మధు



గోదావరిఖని: జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



జూలపల్లి తహసీల్దారు కార్యాలయంలో..



కమాన్‌పూర్‌లో..



పాలకుర్తి: కన్నాలలో జెండా ఆవిష్కరణ



ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయంలో..



యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ నాయకులు



సుల్తానాబాద్: మున్సిపల్ కార్యాలయంలో

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల్లో సోమవారం జాతీయ జెండా ఆవిష్కరించారు. వివిధ రాజకీయ పార్టీలు, యూనియన్ల ఆధ్వర్యంలో గ్రామాల ప్రధాన కూడళ్లలో పతాకం ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పించారు. విద్యాసంస్థలు, బ్యాంకుల్లో జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సీట్లు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



మంథని: జెండా ఎగురవేస్తున్న ఆర్డీవో సురేశ్



ముత్తారంలో..



సుల్తానాబాద్‌రూరల్: నర్సయ్యపల్లిలో..



ఫెర్టిలైజర్‌సిటీ: గుంటూరుపల్లిలో..



కాల్వశ్రీరాంపూర్‌లో..



ధర్మారం: తహసీల్దార్ కార్యాలయంలో..



రామగిరి: తెలంగాణ రన్ ప్రారంభిస్తున్న జీఎం నాగేశ్వరరావు



రామగుండం: అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో..



గోదావరిఖని: పూలమాల వేస్తున్న ఆర్జీ-2 జీఎం వెంకటయ్య



రామగిరి: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎం నాగేశ్వరరావు

అమరుల త్యాగఫలమే తెలంగాణ

కోల్‌సిటీ: అనేకమంది త్యాగాల ఫలితమే రాష్ట్రం ఏర్పడిందని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా బల్దియా కార్యాలయంలో సోమవారం జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నగర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా 'ఒక మార్పు– అభివృద్ధికి మలుపు' నినాదంతో ఈనెల 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు 100రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయయనున్నట్లు తెలిపారు. అనంతరం పచ్చ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వందరోజుల ప్రణాళికలో చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వాములమవుదామని డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ప్రతిజ్ఞ చేయించారు. నగరపాలక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, ఏసీపీ శ్రీహరి, ఆర్వో ఆంజనేయులు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జమీల్, ఏఈ తేజస్విని, టీపీవో నవీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, ఆర్ఐ శంకర్‌రావు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న కమిషనర్ అరుణశ్రీ

సంక్షిప్త వార్తలు

• పుస్తెలతాడు దొంగ అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: పేకాట మోజులో అప్పుల పాలై దొంగగా మారిన డిగ్రీ విద్యార్థిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం దొంగకు సంబంధించిన వివరాలు ఆయన వెల్లడించారు. గత నెల 28న గట్టెపల్లి శివారులోని మామిడి తోట వద్ద రమ్య అనే మహిళ మామిడికాయలు అమ్ముతుండగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూర్‌కు చెందిన కాల్వ రాజు(21)అనే డిగ్రీ విద్యార్థి ఆమె మెడలోంచి రెండు తులాల పుస్తెలతాడు లాక్కొని వెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం కాట్నపల్లి(కొమండ్లపల్లి)వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానంగా కనిపించడంతో విచారించగా దొంగలించిన బంగారం కరీంనగర్‌లో అమ్మేందుకు వెళ్తున్నట్లు తేలిందన్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ మహేందర్, కానిస్టేబుళ్లు రమేశ్, రాజుకుమార్, అరుణ్, వేణు సదానందం, పొత్కపల్లి ఏఎస్సై రత్నాకర్, హెడ్ కానిస్టేబుల్ కిషన్‌ను ఎస్సై అభినందించారు.

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోదావరిఖని: స్థానిక మార్కండేయకాలనీ రాజేశ్ టాకీస్ వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యెలగం తిరుమలేశ్(52) సోమవారం మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం గత నెల 28న బిల్డింగ్ గోడకు ఐఐఎఫ్ఎల్ గోల్డ్‌లోన్స్ ఫ్లెక్సీ బోర్డు మొదటి అంతస్తు ఎక్కి బిగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఆ బిల్డింగ్ పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తాకి బిల్డింగ్ గోడపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. మృతుడి తమ్ముడు పాండురంగం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతుని స్వగ్రామం హన్మకొండ పట్టణం మచిలీబజార్ కాగా భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

• అత్యధికంగా వరిధాన్యం కొనుగోళ్లు

సుల్తానాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అత్యధికంగా వరిధాన్యం కొనుగోలు చేశామని సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లు చేశామన్నారు. కొనుగోలు చేసిన వెంటనే బ్యాంకుల ద్వారా వారి వారి అకౌంట్లలో డబ్బులు జమ చేసినట్లు వివరించారు. సంఘం కార్యదర్శి బూర్గు సంతోష్ కుమార్, సభ్యులు ముద్దసాని సురేశ్‌రెడ్డి, కూకట్ల ఓదెలు, పన్నాల రాములు, మానుపాటి పోచమ్మ, పోతర్ల కమలమ్మ, క్యాదాశి లచ్చయ్య, బండ గోపాల్ ఉన్నారు.

• ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ అర్చకులు ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి మిత్రుడు హైదరాబాద్ నివాసి, ఎన్ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాటకుల అనిల్, వెంకటరమణ, శ్రీనివాస్ ఉన్నారు.

• నేడు పారిశుధ్య సిబ్బందికి హెల్త్‌కార్డుల పంపిణీ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం భూగర్భ, ఉపరితల మురుగునీటి కాలువలు శుభ్రం చేసే విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బందికి హెల్త్‌కార్డులు పంపిణీ చేయనున్నారు. ఈ హెల్త్ కార్డులతో కుటుంబ సభ్యులతో సహా రూ.5లక్షల వరకు గుర్తించబడిన ఆసుపత్రుల లో నగదు రహిత వైద్య చికిత్స పొందడానికి అవకాశం ఉంటుంది. ఎలాంటి ప్రీమియం చెల్లించనవసరం లేదు. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మొదటి విడతలో 18మందికి హెల్త్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ తెలిపారు.

మండల టాపర్‌కు సన్మానం



సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కమాన్‌పూర్: పదో తరగతి చదివి పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గ, జిల్లాలో రెండో స్థానంలో నిలిచిన మండలంలోని జూలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి వైద్య శ్రీవరుణ్‌ను సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఈవో మాధవి సన్మానించారు. పాఠశాల హెచ్ఎం సుజాత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, వీవోఏ ప్రేమలత, టీచర్లు నాగరాజు, వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ నగరంలోని కట్టరాంపూర్ శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సోమవారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద స్థానిక మాజీ కార్పొరేటర్ ఆకుల నర్మదానర్సయ్య స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు రాజేందర్, మూల జైపాల్, పత్యం మోహన్, జైలర్ మల్లేశం, అంజన్న, కొమ్ము అనిల్ ఉన్నారు.

ఘనంగా గంగాభవానీ వేడుకలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పాట్యాలలో సోమవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగాభవానీ సమేత శివ పంచాయతీ క్షేత్రం (ఆలయం) ప్రారంభ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలిఠాకూర్ హాజరై గంగపుత్రుల ఆరాధ్యదైవాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణిని గంగపుత్ర మహిళలు సత్కరించారు.

విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతాం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి విద్యాసంస్థలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతామని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ జెండాను ఆవిష్కరించి ఉద్యమం నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఆర్జీ–2 ఏరియా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, హెచ్ఎం సుందర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడ్యుకేషనల్ సెక్రటరీ శ్రీనివాస్

రీజియన్ సేఫ్టీ జీఎంగా మధుసూదన్

గోదావరిఖని: రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎంగా మధుసూదన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను క్వాలిటీ జీఎం భైద్య, ఈఅండ్ఎం డీజీఎం కె.అశోక్‌కుమార్, ఏరియా సేఫ్టీ అధికారులు సాయిప్రసాద్, సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

రామగుండం: తమిళనాడులోని చెన్నై కేఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల 26 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరిగిన ఉషూ జాతీయస్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన విక్టరీ షోటోకాన్ కరాటే–స్పోర్ట్స్ సంస్థకు చెందిన విద్యార్థిని కోడెం వైష్ణవి ప్రతిభ కనబరిచింది. ట్రెడిషనల్ కుంగ్‌ఫూ, ఫ్లెక్సిబుల్ వెపన్ విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. వైష్ణవిని స్థానిక మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్, విక్టరీ షోటోకాన్ కరాటే రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ వడ్డెపల్లి సురేశ్, ఆర్మీ సోల్జర్ ఇష్రత్ బేగ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండల రాజేందర్, కరాటే మాస్టర్ రాము సత్కరించారు.



కోడెం వైష్ణవి

రాత్రివరకు కొనసాగిన బియ్యం పంపిణీ

కమాన్‌పూర్: మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఈనెలలోనే పంపిణీ చేస్తుండడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. బియ్యం పంపిణీ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తీవ్రజాప్యమవుతోంది. మండలంలోని గుండారం గ్రామంలోని ఓ రేషన్ షాపులో సోమవారం రాత్రి 9గంటల వరకు బియ్యం పంపిణీ కొనసాగింది. లబ్ధిదారులు ఉదయం నుంచి రాత్రి వరకు బారులు తీరి కనిపించారు.



బియ్యం కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ప్రారంభం



సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ: రామగుండం నగరం నవనిర్మాణం కోసం కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.20కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను సోమవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్ పాల్గొన్నారు.